# కొంటె కోణంగి

"మా తమ్ముడు ట్రాన్స్‌ఫరై అమెరికా నుండి హైద్రాబాదుకొస్తున్నాడట. వానికి పుత్తడిబొమ్మలాంటి కూతురుంది. పెళ్లీడు కొచ్చిందట. నువ్వెప్పుడో చిన్నప్పుడు చూసుంటవు కదరా"! అమ్మ ప్రస్తావనలోని అంతరార్థం కుశ్రాలావుకు పొల్లుబోకుండా అర్థమైంది. "మా బావగ్గూడా చెన్నై నుండి హైద్రాబాద్‌కు ట్రాన్స్‌ఫరైందటా. వాళ్లకొక్కతే కూతురు. అప్సరలాగుంటుందిరా!" నాన్న అన్నాడు. నాన్న మాటల వెనకున్న భావం... తన మేనకోడల్ని సొంత కోడలుగా చేసుకోవాలనుందని తెలిసిపోయింది. అమ్మానాన్నల అల్లాటప్పా మాటలకు బుట్టలో పడేందుకు తనేమన్నా చాక్లెట్ చప్పరించే పిల్లాడా? "నా పెళ్లికేమీ తొందరలేదు. నాక్కాబోయే భార్యను నేనే వెతికి పట్టుకుంటాను. మీరు నిశ్చింతగా ఉండండీ" డిక్లేర్ చేశాడు. థర్డ్ ఎంపైర్ డిసిషన్ కోసం ఎదురుచూస్తున్న క్రికెట్ ఆటగాళ్లలా అమ్మా నాన్నలు మొహాలు చూసుకున్నారు. "అంటే.... నీ ఉద్దేశ్యమేమిట్రా? ఇరవయ్యేనిమిదేళ్లు నెత్తిమీద కొచ్చినై. పెళ్లిమాటెత్తితే పితలాటకమెందుకురా?" తల్లి నడుముకు కొంగు బిగించుకుంది. "అసలూ.... బెండకాయ ముదిరినా, బ్రహ్మచారి ముదిరినా పనికి రావంటారు."

"కాని... నేనంతగా ముదిరిపోలేదమ్మా!"

"ఒరేయ్! నాకైతే పాతికేళ్లొచ్చేసరికి మీ అక్క నువ్వు, నీ చెల్లి ముగ్గురు పిల్లలైనారు తెల్సా!" మెగా హీరోలా మీసం మెలేస్తున్న నాన్న వాలకానికి నవ్వొచ్చింది. బాగానే ఉంది సంబండం! అన్నట్లుగా మూతులుతిప్పి తన దగ్గరకొస్తున్న అమ్మను చూస్తుంటే... లలితా సహస్రనామాల్లో ఆదిశంకరాచార్య అమ్మవారి వర్ణన."శింజాన మణిమంజీర మండిత శ్రీపదాంబుజా, మరాళీ, మందగమనా మహా లావణ్యశౌపధీ.." (పాదమంజీరాల సవ్వడి లేకుండా ప్రతిధ్వనిస్తూ ఆడహంసలా ప్రత్యేక నడకగల మందగమన)...

గుర్తుకొచ్చింది. తృప్తిగా, తమకంగా, ముసిముసిగా నవ్వుకున్నాడు. అమ్మానాన్నలు పంతాలకుపోయి ఇద్దరు మరదళ్లను అంటగట్టరు గదా!

"ఇద్దరు భామల కౌగిలిలో స్వామి
ఇరుకున పడినీవు నలిగితివా.." సిన్మాపాట గుర్తుకొచ్చింది.

వయసు పరువములో పిటపిటలాడ్తున్న అమ్మాయి ఆఫీసులో పంజేస్తుందంటే యువ ఉద్యోగులకు కోతికి పచ్చికొబ్బెరిచిప్ప కనబడ్డట్టుంటుంది. లడ్డూలాంటి యువతి ఆరోజే వచ్చిందా ఆఫీసుకు. ఆఫీసర్ చాంబర్‌కెళ్లి జాయినింగ్ రిపోర్టిచ్చింది.

"కొత్తగా ఉద్యోగంలో ఈ రోజే చేరావుగదమ్మా!" ఆఫీసర్ నఖశిఖ పర్యంతం చూస్తున్నాడు.

"అవున్సార్!" పగడము, దొండపండు కలెగలిపిన ఎఱ్ఱని పెదాలమీద వెన్నెల్లాంటి చిరునవ్వు తళుక్కుమంది. నుదురు మీద తచ్చాడుతున్న ముంగురుల్ని మునివేళ్లతో నాజూగ్గా సవరించుకుంది. ఆమెను ఎకౌంటెంట్ ముందుకు తీసుకొచ్చాడు ఆఫీసర్. అందరికళ్లు ఆమె మీద వాలాయి.

"మిస్టర్ కుశ్రాలావ్! ఈ అమ్మాయి రంజిత. మీ అకౌంట్స్ సెక్షన్‌లో ఖాళీవుంది గదా! ఈ రోజే కొత్తగా ఉద్యోగంలో చేరింది. బిల్లు ప్రిపరేషన్ లాంటి పనులన్నీ నేర్పించండి" చెప్పేసి వెళ్లిపోయాడు.

"మ్మ... మీరు ఆ కుశాల్రావుగారే కదూ!" రంజిత కనురెప్పలు తుమ్మెదరెక్కల్లా టపటపలాడాయి.

"అవునండీ. ఆ ఖాళీ సీట్లో కూచోండి" ఆశ్చర్యానందాలను గొంతులో అదిమిపెట్టాడు కుశాల్రావు. పెద్ద పుస్తకమొకటి అల్మారలోంచి తీసాడు. "ముందీ అకౌంట్స్ మాన్యువల్ చదువండి. ఆ తర్వాత పనిచేద్దురుగాని.." చూపులు చేతులై ఆమె ముఖారవిందాన్ని తడుముతున్నాయి.

"సరే సార్!" మర్యాదగా లేచి మాన్యువల్ అందుకుంది. సెక్షన్ క్లర్కుల చూపులు... ఆమె గుండెల మీద కదుల్తున్న ఒంటిపేట గొలుసు లాకెట్ మీదున్నాయి.

"ఫ్రెండ్స్!" అందరి దృష్టిని తనవైపుకు మరల్చాడు కుశాల్రావు. నా మొదటి పోస్టింగ్ జోగిపేటలో, కొత్తగా ఉద్యోగంలో చేరాను. ఇప్పుడు రంజిత గారెలా ఫీలవుతున్నారో అపుడు నేనలాగే ఫీలయాను. వీరింట్లోనే అద్దెగదిలో ఉండేవాణ్ని. ఆల్‌రెడీ ఎంకాం పాసయ్యాను కాబట్టి ప్రమోషన్ మీద ఇక్కడికొచ్చాను." స్టాఫుకు పరిచయం చేశాడు. అందరికీ అభివాదము చేసి కూచుంది రంజిత. భౌతికంగా మనిషిసీట్లో కూచున్న కుశాల్రావు మనసు జోగిపేట అనుభవాన్ని నెమరేసుకుంది.

"ఇక్కడ మీకెవరన్నా బంధువులున్నారా?" అడిగాడు సాయంత్రం.

"లేరు సార్! అద్దెగది వెతుక్కోవాలి" పమిట అంచును కుడిచేతి కందుకుని గొంతు, చెంపలు అద్దుకుంది.

"గదికోసం మీర్కెడా వెతకాల్సిన అవసరం లేదు. మా ఇంట్లోనే ఓ పోర్షన్ ఖాళీగా ఉంది. మీకు నచ్చితే అందులో దిగొచ్చు..."

ఆ పట్టణములో అద్దెగది ,వెతకాలంటే ఓ చెప్పుల జోడు అరిగిపోద్ది... అని ఎవరో చెప్పిన సంగతి గుర్తుకొచ్చింది. "థాంక్స్ సర్!" అంటూ లగేజితో వెంబడించింది.

డ్రైవర్‌కు అడ్రసు చెప్పి ఆటోలో కూచున్నారు. తార్రోడు మీద ఆటో పరుగెడుతోంది. భుజాలు మెత్తగా ఒరుసుకుంటున్నాయి. కుశాల్రావు మనో ఫలకంపై అప్పటి జోగిపేట దృశ్యాలు రంగుల చిత్రాల్లా కదుల్తున్నాయి...

❋ ❋ ❋

ఉద్యోగంలో ఉత్సాహంగా చేరిన తనకా రోజు విశేషంగా తోచింది. సూటుకేసు నేలమీదుంచి ఇంటి గడపలో నుంచున్న యువతి నాపామస్తకం చూస్తూ "రంగారావు గారిల్లు ఇదేనాండీ?" బిక్కుబిక్కు మంటూ వినయం ఒలకబోశాడు.

"అవును.. మీకెందుకూ?" పెదాలమీదో చిరునవ్వు పున్నమి వెన్నెల కెరటంలా కదిలింది.

"నా పేరు కుశాల్రావండీ. నేను సిద్దిపేట నుండి వచ్చాను. ఈ ఊళ్లో కొత్తగా ఉద్యోగములో ఈరోజే జాయినయ్యాను మరి... మీరో!"

నా పేరు రంజిత. రంగారావు మా నాన్న" మొహంలోకి నిశితంగా చూసింది.

"సిద్దిపేట నుండి జోగిపేటకొచ్చారా?" గజ్జెల గుర్రంలా కదుల్తొంటే చెవుల రింగులు ఉయ్యాలలూగాయి

లంగా, వోణి, వాలుజడలో మల్లెదండ... నూటికి నూరు పాళ్ల తెలుగుదనం. హృద్యంగా వుంది. మనసులో మల్లెల వాన కురిసింది.

వయసు సమకూర్చిన వంపుసొంపులతో కదుల్తూ "ఓహో! అందుకా, రండి లోపలికి గబుక్కున వెనుదిరిగింది. ఆ ఊపులో వోణీ జారింది. ఎత్తైన వక్ష సంపద కనువిందు చేసింది. వెంటనే సర్దుకుంది. అమ్మా, నాన్నల్ని కేకేసింది.

"రండి... గది చూడండి." అంటూ పోర్షన్‌లోకి తీసుకెళ్లింది. రెండు గదుల పోర్షన్. తనకు సరిగ్గా సరిపోతుంది. లోపలిగది లోంచి ఇంట్లోకెళ్లొచ్చు. బయటి గదిలోంచి బయటికొచ్చి తాళం ,వేసుకోవచ్చు. అటాచ్డ్ బాత్రూం.. అన్నీ బాగున్నాయి.

"మీరేదన్నా ఉద్యోగం చేస్తున్నారండీ?" అడిగాడు. అరచేతులు నడుమ్మీదుంచి కిలకిలా నవ్వింది. ఆ నవ్వు వెండి కొండపై పండువెన్నెల తుళ్లిపడ్డట్టుంది. గుండెలు గమ్మత్తుగా కదుల్తున్నాయి.

"ఎందుకు నవ్వుతున్నారండీ?"

"ఇంకా నా డిగ్రీయే పూర్తికాలేదు. అప్పుడే ఉద్యోగమా? ప్రస్తుతం బియ్యే ఫైనల్ స్టూడెంటును."

"శుభం" లగేజి గదిలోకి తీసుకురావడములో సాయపడింది. వాళ్లమ్మ-నాన్నలు ఇద్దరూ ఉద్యోగస్తులే. అద్దె సంగతి మాట్లాడి లోపలికెళ్లారు. ఏ వస్తువు నెక్కడుంచాలో చెబుతూ సామానంతా సర్దేస్తూ వాళ్లన్నయ్య వదినలు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారని చెప్పింది. ఆమె మాటలు వీణానాదం లాగున్నాయి. నాలుగు రోజులు ఒకే ఇంట్లో ఉంటే వారు వీరవుతారన్నట్టు వారం రోజుల్లో మొహమాటం మాయమైంది.

రోజూ కాలేజి నుండి రాగానే టీవీలో సాగదీత సిరియల్స్ చూడ్డం తప్పింది రంజితకు. తాను ఠంచన్‌గా ఐదింటికింటికొచ్చేవాడు. ఇల్లు ఆఫీసుకు చాలా దగ్గర. గంటసేపు రంజితతో బాతాకానీ, సినిమాలు, సీరియల్స్, సాహిత్యమ్మీద ఆసక్తికరమైన చర్చ జరిగేది. జోకులు కట్‌చేస్తూ నవ్వుకునేవారు. ఆమె నవ్వు సరస్వతీనదీ ప్రవాహంలాగుంటే తననవ్వులో గంగా తరంగాలుండేవి.

సత్యభామ బింకం, వరూధిని పొంకం గురించి గూడా చర్చ సాగేది. ఆమె కుర్చీలో కూచున్నపుడు పొడగాటి జడ నేలను తాకకుండా ఉండేందుకు గుండెలమీదికి లాక్కునేది. అదృశ్యం... నల్లనాగు మెలికలు తిరుగుతూ కొండెక్కుతున్నట్టుగా కనబడేది. మాటల మధ్యన వోణీ సర్దుకుంటూంటె పిడికెడు నడుమ్మీద బంగెనపల్లి మామిడిపళ్ల అందాలు అపురూపంగా కనబడేవి.

ఓ రోజు తాను మంచమ్మీద, ఆమె కుర్చీలో కూచుని మాట్లాడుకుంటున్నారు. వరూధిని ప్రవరాఖ్యుల ప్రస్తావన వచ్చింది. ఆమె లేచి "వరూధిని ఇలా నడిచేదేమో!" అంటూ హంసలా అడుగులేస్తూ వచ్చింది తన ముందుకు. కాలి పట్టీల మువ్వలసవ్వడి గుండెల్లో గుసగుసలు రేపింది. తన పక్కన కూచుండి దగ్గరకు జరిగింది. "వరూధిని ఇలాగే ప్రవరాఖ్యుడిని వెంటాడొచ్చుగదా!" అడిగింది.

"సూపర్ రంజితా! వరూధిని హిమాలయాల నుండి నేరుగా నాగదిలోకి దిగి వచ్చినట్టుంది కంగ్రాట్స్... చెయ్యిచ్చాడు. ఉత్సాహంగా చెయ్యి కలిపింది. ఇద్దరిలో విద్యుత్తు ప్రవహించింది. మొగ్గదొడిగిన ఆనందం కళ్లల్లో విరబూసి పెదాలను కదిలించింది. రెండు సంవత్సరాలు సరదాగా గడిచాయి.

మాటల మధ్యన ఓసారి "మీ పెళ్లి గురించి మీ అమ్మానాన్న లేమనుకుంటున్నారు?" అడిగాడు ఆసక్తిగా. చారెడేసి కళ్లను గమ్మత్తుగా తిప్పుతూ "మా అమ్మానాన్నలది లవ్ మ్యారేజి. నా పెళ్లి విషయంలో నాకు పూర్తి స్వేచ్ఛ ఉంది" అనేసింది.

కాలగమనం, కడలికెరటాలు మనిషి కోసం ఆగవు గదా! మరికొన్ని రోజులు గడిచాయి. రంజిత ఎమ్మే ఫైనల్‌కొచ్చింది. అంతకు ముందే క్వాలిఫికేషనున్న తాను ప్రమోషన్ ప్యానల్‌కొచ్చాడు.

ఓ శనివారం సాయంత్రం రంజిత అమ్మానాన్నలు బంధువుల పెళ్లికి ఏదో ఊరెళ్లారు. ఆదివారం ఉదయం "కుశాల్రావు గారూ!" రంజిత గొంతు వినబడింది. అయ్యో పాపం! ఏమైందో? అనుకుంటూ ఆఘమేఘాల మీద పరుగెత్తాడు. ఇంట్లో రంజిత కనబడలేదు.

"రంజిత గారూ! ఎక్కడున్నారు?" ఆందోళనగా అడిగాడు

"ఇక్కడండీ.. బాత్రూంలో స్నానమైంది. తువ్వాలు మరిచిపోయాను. కొంచెం తెచ్చివ్వరూ!"

నేనెందుకు తెచ్చివ్వడం! ఇంట్లో ఒక్కతే ఉందిగదా, తానే బయటికొచ్చి తీసుకోవచ్చు గదా!... ఏమో! నాగది డోర్ తెరిచుంది గదా!... ఆలోచిస్తున్నాడు.

"ఏమైందండీ? తువ్వాలుదొరకలేదా? అక్కడే దండెమ్మీదనే ఉందండీ!"

"ఆ... దొరికింది. తెస్తున్నా" బాత్రూంముందుకెళ్లి నుంచున్నాడు.

"ఇదిగో తీసుకోండి."

"ఇలా ఇవ్వండి" బాత్రూంలోంచి చెయ్యిచాచింది. అందించాడు. తువ్వాలు చుట్టుకుని డోర్ తెరిచింది. బయటికి వచ్చింది. ఓహో! పాలరాతి విగ్రహానికి ప్రాణం పోసినట్టు, రవివర్మ రంగుల చిత్రం కదుల్తున్నట్టుంది. తన లోపల చిలిపి అల్లరి.. పెదాలు చప్పరిస్తున్నాడు.

"మీరింకా ఇక్కడే ఉన్నారా? నేను బయటికెట్లారావాలి? తన భుజంపట్టి పక్కకు జరిపింది. మనసుకు మాటలొస్తే నఖశిఖ పర్యంతం వర్ణించి చెప్పేది. తనను నిశితంగా చూసి చిన్నగా నవ్వింది.

ఆ నవ్వు నెలవంకను తలదన్నేలాగుంది.

ఏదో ధైర్యం. తానేం చేస్తున్నాడో తెలియని తమకం. గబుక్కున చెయ్యందుకున్నాడు. మొదట తుళ్లిపడి ఆ తర్వాత కళ్లలోకి సూటిగా చూసింది. "నన్ను డ్రెస్సు వేసుకోనివ్వరా?" పెసరకాయ పెదాలమీద మిసమిసల చిరునవ్వు. నడుముకు చేతులు చుట్టబోయాడు. "యూ... నాటీ..." అంటూ గదిలోకెళ్లింది.

ఇంకా నయం... చాచి లెంపకాయకొట్టలేదు. వెంటనే తన గదిలోకి పరుగెత్తాడు. నేరుగా బాత్రూంలో దూరాడు. అవే ఆలోచనలతో స్నానం పూర్తయింది. తువ్వాలు లేదు... అరెరే!

"రంజిత గారూ!" పిలిచాడు. పరుగెత్తుకొచ్చినట్టుగా వినబడింది. "ఏందీ బాత్రూంలో ఉన్నారా? తువ్వాలు మరిచారా?" అంటూ తువ్వాలు తెచ్చి బాత్రూం ముందుకొచ్చింది.

"అవునండీ. నిజంగానే మరిచానండీ!"

"ఐతే.. ఇదిగో... తీసుకోండి..."

చెయ్యి చాచాడు. తువ్వాలు చుట్టుకుని బయటికి రాబోయాడు. తన జుట్టులోంచి నీటి బిందువులు ముత్యాల్లా రాలి భుజమ్మీద పడ్తున్నాయి. రంజిత అక్కడేనుంచుంది. నిర్మలాకాశంలో ఉదయ సూర్యుడిలా నుదుటి మీద కుంకుమ బొట్టు.. కిలకిలా నవ్వింది. ఆ నవ్వు నవరత్నాలు కుమ్మరించినట్టుంది. నాభిని చీల్చుకుంటూ వచ్చి ఓ నిట్టూర్పు వెలువడింది. సిగ్గుతో ఆమె బుగ్గలు ఎర్రమందారా లైనాయి.

"నేను డ్రెస్సు వేసుకోవాలండీ!" చూపులు ఆమె వక్ష సంపద మీదున్నాయి.

"నేనొద్దన్నానా?" అడిగింది.

"అరెరే! నేను వోణీ మరిచానండీ!" అలాగేనుంచుంది. చేతులు నడుముకు చుట్టేసి గుండెలకు హత్తుకున్నాడు. మళ్లీ నవ్వింది. ఆ నవ్వు మనోహరంగా..తొలిమంచు పడిన మల్లెరేకులా, ఒద్దుతో గుసగుసలాడే అలల సంగీతంలాగుంది. వెచ్చని ఉచ్ఛ్వాస. నిశ్వాసలు రెచ్చగొడుతున్నాయి. విడిపించుకుని లేడిపిల్లలా పరుగెత్తింది.

ఆ రోజు టిఫిన్, భోజనం తానే చేసిపెట్టింది. కమ్మని కబుర్లు చెప్పుకుంటూ కలిసి భోంచేశారు. మ్యాట్నీ సినిమాకెళ్లారు. వచ్చేటప్పుడు ఆటో... సందుల్లోంచి పయనిస్తోంది.

చెయ్యందుకుని గిల్లుతూ "మీరెప్పుడు పెళ్లి చేసుకుంటారు?" అర్థవంతగా అడిగింది.

"మీ లాంటి అమ్మాయి నాదైనప్పుడు" అదే చెయ్యందుకుని ఆబగా ముద్దాడాడు. అటూ ఇటూ చూసింది. సన్నని మీసాలను నున్నని వేళ్లతో తడిమి బుగ్గమీద ముద్దుబెట్టుకుంది. అమాంతం ఒడిలోకి లాక్కున్నాడు. నాలుగు పెదాలొకటై తేనెలు జుర్రుకుంటున్నాయి....

ఆటో రిక్షా సడెన్‌గా ఆగిపోయింది. "ఇదేనా సార్ మీ ఇల్లు?" ఆటో వాలా అడిగాడు. స్వర్గంలోకం లోంచి సామాన్య మానవలోకానికొచ్చారు.

"ఛీ... పాడు... నడిబజార్లో..." నాజూగ్గా చెయ్యిలాక్కుంది. ఇంట్లో కొచ్చేసరికి వాళ్లమ్మా నాన్నలున్నారు. ఆ తర్వాత ఆమెకు ఎమ్మే పరీక్షలు, తనకు ప్రమోషన్ ట్రాన్స్‌ఫర్.

"మాఇల్లు ఇదే! దిగుదామా?" తానొక సూటుకేసు పట్టుకుని దిగాడు. మరో సూటుకేసు ఎయిర్ బ్యాగుతో రంజిత దిగింది.

"ఈ అమ్మాయెవర్రా! అన్నయ్యా" అల్లరిచెల్లి ఊర్మిళ ఎదురొచ్చి కుశాల్రావు చేతిలోంచి సూటుకేసందుకుంది.

"చెప్తాగాని మీ కాలేజి ఎక్స్‌కర్షన్ టూర్ నుండి ఎప్పుడొచ్చావు?"

"నువ్వటు ఆఫీసుకెళ్లిపోగానే నేనిటు వచ్చాను గాని ఈ ముద్దుల గుమ్మ ఎవరూ?" రంజితను ఎగాదిగా చూస్తోంది. సమపాళ్ల శరీర సౌష్టవం, మిసమిసలాడే ఒళ్లు, మొగ్గలాగున్న పెదాల మీద చిరునవ్వు మల్లెపూవులా వికసించింది.

"ఎవల్తో మాట్లాడ్తున్నావే ఊర్మిళా?" తల్లి వచ్చింది. ఆశ్చర్యంతో భృకుటి పీటముడేసుకుంది.

"అబ్బా... ఏమిటర్రా?" నాన్న బయటికొచ్చి షాక్‌తిన్నాడు.

ముందు రంజితకు తల్లి-తండ్రిని పరిచయం చేశాడు. ఆ తర్వాత చెల్లి చెయ్యిబట్టి ముందుకు తీసుకొచ్చాడు. "ఈమె పేరు రంజిత. ఊరు జోగిపేట. రంజితా! ఈ చిచ్చరపిడిగు నాచెల్లి, పేరు ఊర్మిళ. కాని అగ్గిబరాటా... బియస్సీ ఫైనలియర్ స్టూడెంటు. ప్రస్తుతం తమరుండేది మా చెల్లిగదిలోనే కలిసి ఉండండి."

"ప్రస్తుతమంటే... ఎన్ని రోజుల్రా అన్నయ్యా?"

"మీ ఇంట్లో ఓ పోర్షన్ ఖాళీ ఉందన్నారు గదా?" రంజిత అయోమయంగా అందరి మొహాలు చూసింది.

కుశాల్రావు నవ్వుకున్నాడు. "నేను జోగిపేటలో ఉన్నపుడు వీళ్లింట్లోనే ఉన్నాను. ఆ తర్వాత..."

" ఆ సంగతంతా నాకోసారి చెప్పావుగాని నాగదిలో ఎన్ని రోజులుంటుంది?" కొద్దిరోజులే తల్లీ!" రంజిత వైపు తిరిగాయి చూపులు. కళ్లతో ఏదో మాట్లాడుకున్నారు. "ఆ ఇంట్లో నా గుండెగూడు అనే పోర్షన్ ఖాళీగా ఉంది. ఇష్టమొచ్చినపుడు ఆ పోర్షన్‌లోకి మారవచ్చు."

తల్లి దండ్రులగ్గూడా ఆసాంతం అర్థమైంది.

¤ ¤ ¤

(ఆశ, డిసెంబర్ 2011)